# మాలవరపు బాల లతా

## యంగ్ అచీవర్ ఆఫ్ ది ఇయర్ - ఎడ్యుకేషన్

''ఒక అమ్మాయి జీవితమంటే సోదరి, భార్య, తల్లి ఇంతేనా?
ఈ భూమ్మీదకు వచ్చినందుకు మనకంటూ ఏదైనా చేస్తే తృప్తిగా ఉంటుంది''
జీవితంలో తానిక నడవలేను అని తెలుసుకున్న బాలలత మనసులో మెదలిన ఆలోచన ఇది.

అదే ఆమె సంకల్పంగా మారింది. ప్రస్తుతం భారత రక్షణ శాఖలో డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న బాలలత సంతృప్తికోసం అనుకున్నది సాధించారు, ఇంకా సాధిస్తూనే ఉన్నారు.

మల్లవరపు బాలలత. నిజామాబాద్ జిల్లా బోధన్ మండలం జడి జమాల్‌పూర్ గ్రామం. తల్లి విజయరాణి, తండ్రి శౌరయ్య. పోలియో చుక్కలు వికటించడంతో నడకకు దూరమైన లతను తల్లిదండ్రులు తిప్పని ఆసుపత్రి లేదు. చేయని ప్రయత్నమూ లేదు. వైద్యం కోసం ఊళ్లు తిరగడంతో బడికి దూరమవడం తప్ప మరో ఫలితం కనిపించలేదు. అమ్మానాన్న శ్రద్ధగా బోధించడంతో పదవతరగతి పూర్తి చేసిన బాలలత ఆతర్వాత చదువంతా దూరవిద్యలోనే పూర్తిచేశారు. ఇంటర్ రెండు సబ్జెక్ట్స్ ఫెయిలయినపుడు కొందరు నవ్వారు, ఆమె కుంగిపోలేదు. లా ఎంట్రన్స్ లో ఫస్ట్ ర్యాంకు వచ్చినపుడు చాలామంది చప్పట్లు కొట్టారు, ఆమె పొంగిపోలేదు. తనకు తృప్తి కలిగించే విజయం కోసం చదువుల యజ్ఞం సాగించారు. తనపై ఒకరు జాలి చూపించడాన్ని అస్సలు సహించలేని లత తానేంటో ఈ ప్రపంచానికి పరిచయం చేయాలనుకున్నారు. పట్టుదలతో

సివిల్స్ రాసి తొలి ప్రయత్నంలోనే 399 ర్యాంకు సాధించారు. తనను చూసి ఒకప్పుడు పక్కకు జరిగిన వాళ్లే తనతో ఫొటో దిగడానికి పోటీ పడేలా చేశారు. ఇంత పెద్ద విజయంతో ఆమె చదువుల ప్రయాణం ఆగిపోలేదు. సివిల్ సర్వీసెస్ రాయాలనుకునే నిరుపేద విద్యార్థులకు అండగా నిలబడాలి అనుకున్నారు. తనలాంటి పరిస్థితుల్లో ఉన్నవాళ్లుకు సైతం ఆత్మస్థైర్యం కోల్పోకుండా చేయందించాలి అని నిర్ణయించుకున్నారు. ఆమె గెలుచుకున్న ఉద్యోగం కంటే ఎంచుకున్న లక్ష్యం గొప్పది. అందుకే తన దగ్గర కోచింగ్ తీసుకున్నవాళ్లు సివిల్స్ లో గొప్ప గొప్ప ర్యాంకులు సాధించారు. బోధించేవాళ్లు ఎప్పుడూ విద్యార్థులతో పోటీ పడాలి అని నమ్మే బాలలత 2016లో రెండోసారి సివిల్స్ రాసి 167వ ర్యాంకు సాధించారు. ఐఎఎస్ వచ్చినా ట్రైనింగ్ కి ఎందుకు వెళ్లలేదని అడిగితే నా దగ్గరకు వచ్చే పిల్లల్లో ఆత్మస్థైర్యం నింపడానికే నేను మళ్లీ సివిల్స్ రాశాను అంటారు. నాన్న చెప్పిన చదువు కంటే ఆయన ఇచ్చిన ధైర్యమే నన్ను ముందుకు నడిపించింది అని చెప్పే బాలలత... ఇప్పుడు ఎంతోమందిని ముందుకు నడిపిస్తున్నారు. విధి చేసిన తప్పిదాన్ని తన విజయాలతో సరిచేసి, చుట్టూ ఉన్న సమాజానికి తన కాళ్లవైపు చూసే అవసరం లేకుండా చేసిన విజేత ఆమె. ఇప్పటివరకు 70 మందికి పైగా శిక్షణ ఇచ్చి, దేశానికి ఎక్కువమంది అధికారులను అందించడంలోనే తనకు సంతృప్తి ఉందంటున్న ఈ చదువులతల్లిని... ఎడ్యుకేషన్ విభాగంలో సాక్షి ఎక్సలెన్స్ అవార్డ్స్ 2017 యంగ్ అచీవర్ ఆఫ్ ద ఇయర్‌గా సత్కరిస్తోంది సాక్షి.